తున్నాను కూడాను. ముగ్గురు మనుష్యులపని చేస్తున్నాను నేను ఒకణ్ణీని” అని అన్నాడు, నరసింహారావు మొహం చూస్తూ.

“నరసింహారావు, ఆఫీసు ఖర్చు చాలా ఎక్కువ అయిందని ఇప్పుడేకదా, నీకు చెప్పాను. నువ్వు ఒక్కడివీ ముగ్గురు గుమాస్తాల పని చేస్తున్నానంటున్నావ్. ఆ తక్కిన ఇద్దరూ ఎవరో చెప్పు-వాళ్ళని తీసిపారేస్తాను. ఆఫీసు ఖర్చు కొంతేనా తగ్గుతుంది” అన్నాడు యజమాని.

నరసింహారావు నోట మాట లేక అలాగే నిలుచున్నాడు.

# బంగారు నాణెం

జూదం జోరుగా సాగిపోతోంది. అతడి దగ్గరవున్న డబ్బు క్రమక్రమంగా తగ్గిపోతోంది. మిగతా వాళ్ళజేబులు బరువెక్కుతున్నాయి. బల్లమీద అతడు పెట్టిన నోట్లన్నీ హరించిపోతున్నాయి.

అతడు పెద్ద జమీందారీ కుటుంబంలో పుట్టినవాడు. జమీందారులందరిలాగానే త్రాగుడూ, జూదమూ అలవాటు చేసుకున్నాడు. సాటి జమీందారులందరికీ, కళ్ళుకుట్టే ఆస్తినంతనూ పాడుచేసుకున్నాడు. ఈనాడు అతడు జేబులో వేసుకువచ్చిన సొమ్ము కాస్తా జూదపు బల్లమీద హరించి పోయిందంటే, మరునాడు అకడు తిండికికూడా లేకుండా ఇబ్బంది పడవలసిందే. అంచేత వెర్రి ఆవేశంతో ఆడుతున్నాడు. కాని, అతడికి ఆవేశం ఎక్కువ అయిన కొద్దీ నష్టం ఎక్కువ అవుతోంది. జేబులో వున్న నోట్లకట్ట పూర్తిగా అయిపోయేటప్పటికి, పాపం ఆ ఆవేశంకూడా అంతా తగ్గింది. జేబులో డబ్బులు అయిపోయి, ఆవేశం పూర్తిగాతగ్గి జూదమాడడానికి వీలులేక అతడు ఏంచేద్దామా అని గడియారం చూసేటప్పటికి పన్నెండు గంటలయింది. ఏమీ పాలుపోక అతడు వీధిలోకి వచ్చాడు. చీకటి దట్టంగావుంది, మంచు ఒత్తుగా పడుతోంది. వీధి చాలా ప్రశాంతంగావుంది. తన అడుగుల చప్పుడుతో, వీధిలోని ప్రశాంతతను భగ్నపర

చడం యిష్టంలేక, అసలే చీకటితో నిండిన తన హృదయం చీకటిలోకి వెళ్లడానికి యిష్టపడనందున అతడు మళ్ళీ లోపలికి వచ్చేశాడు.

లోపల యింకా జూదం జరుగుతూనే వున్నది. డబ్బు జేబులలోవున్న వారంతా ఆడుతూనే వున్నారు. తన యెదుట జోరుగాసాగుతున్న జూదాన్ని, జేబులోడబ్బులేకుండా చూడడం అతనికి దుర్భరమనిపించింది. ఏమైనాసరే వెళ్ళిపోదా మనుకున్నాడు.

మళ్ళీ బైటికి వచ్చాడు. ఆ జూదశాలలోని నౌకరు అతనితో పాటు బైటికి వచ్చాడు, "బాబూ" అని పిలిచాడు. మరొకరి పిలుపు అయితే ఆజమీందారు పలకనివాడేకాని, ఆ నౌకరు గొంతుగుర్తుపట్టి, "ఏమిరా" అని, రోడ్డుమీదకు వెడుతూవున్న వాడల్లా ఆగిపోయాడు.

"బాబూ, ఒక్క లూయీ వుంటే యివ్వండి బాబూ; తెల్లారితే జనవరి ఫస్టుతేదీ బాబూ, ఆలూయీతోటి, ఆరీన్ రాణిమీద పందెంవేస్తే లోపల వున్నడబ్బంతా గెలుచుకోవచ్చును బాబూ" అన్నాడు అమాయకంగా.

ఆజమీందారు జేబులు తడిమి చూసుకున్నాడు. లూయీకాదుగదా ఒక్క ఫ్రాంకు అయినాలేదు. నౌకరుకు జవాబు అయినా చెప్పకుండా గబగబా నడిచి వెళ్ళిపోయాడు.

ఎక్కడికి వెళ్లుదామా అనే ఆలోచన లేకుండా, అర్ధరాత్రివేళ అలా అతడు నడిచి పోతున్నాడు. రోడ్డుమీద అక్కడక్కడవున్న దీపాలు వెలుతురును సమీపించి నప్పుడల్లా అతనికి భయంవేస్తూ వుంది. హఠాత్తుగా ఒక దీపం దగ్గర, స్తంభానికి దగ్గరగా అతడికి ఒక చిన్న బాలిక కనపడింది. ఆ బాలికను సమీపించాడు. నాలుగేళ్ల ఆ చిన్నబిడ్డ దీపస్తంభానికి తల ఆనించి నిద్రపోతూవున్నది. ఒత్తుగా కురుస్తున్న మంచులో పడివున్న ఆ బాలికనుచూసి అతడు చాలా జాలిపడ్డాడు. చలిలో ఆ బాలిక ఒక ప్రక్కకు ఒత్తిగిలింది. ఆమె ప్రక్కలో తళతళ మెరుస్తూవున్న బంగారు నాణెం అతని కళ్ళను మిరుమిట్లుగొలిపింది, అతని ఆలోచనా శక్తి అంతా ఒక్కసారి పనిచేసింది. పాపం ఆబాలిక పట్ల ఎవరో జాలిపడి ఆ బంగారు

నాణేన్ని ఆమె ప్రక్కలో పడవేసి వుంటారు. అందమైన, జాలిగొలుపుతూ వున్న ఆ బాలిక దీనపరిస్థితి చూస్తే ఎవరిహృదయం చలించదు? తన చేతిలో కొంచెం డబ్బువుంటే ఆ బాలికకు ఎంతైనా సహాయం చేసేవాడేకదా? ఆ———మంచి ఆలోచనే, ఆ బాలిక ప్రక్కలోవున్న ఆ నాణేన్ని తీసుకొని, మళ్లీ జూదశాలకువెళ్లి ఆఠీన్ రాణిమీద పందెంవేస్తే...ఎంతో డబ్బు వస్తుంది. ఆ డబ్బుతో ఆ బాలికను తానుపెంచవచ్చును. స్వర్గసుఖాలను ఆమె అందుబాటులోకి తీసుకురావచ్చును. లేకపోతె ఆ బాలికకు తాను ఏమీ చేయజాలడు. భేష్! ఎంత మంచి ఆలోచన.

అతడు అటూ ఇటూ చూశాడు. మనిషి అలికిడి ఎక్కడా వినుపించలేదు. మెల్లగా, ఆ బాలికకు నిద్రాభంగం కలగకుండా, ఆ బంగారు నాణేన్ని తీసుకొన్నాడు. అతనికి తెలియకుండానే, అతిశీఘ్రకాలంలో అతనికాళ్ళే అతన్ని జూదశాలకు తీసుకొని పోయాయి.

గబగబ లోపలికివెళ్ళి, జూదపుబల్లమీద ఆ బంగారు నాణేన్ని పెట్టి 'ఆఠీన్ రాణి' అన్నాడు ఆ బల్లమీద తొమ్మిదిమంది ఆడుతున్నారు. తొమ్మిదిమందీ తొమ్మిది లూయీలను ఆ బల్లమీద పడవేసి పందెం ఒప్పుకున్నారు. కాని, అతడే గెలిచాడు. తన చేతిలో పదిలూయీలు వున్నాయి. రెండో పందెంలో పది లూయీలను ఒడ్డి ఎత్తుకాశాడు. నూరులూయీలు గెలుచుకున్నాడు. అతడికి ఉత్సాహం కలిగింది. ఉత్సాహంతో ఆవేశం ఎక్కువైంది. మూడో పందెంలో నూరులూయీలను ఎత్తువేశాడు. వెయ్యి లూయీలు వచ్చాయి.

పదివేల లూయీలు. లక్ష లూయీలు. అతడుగెలుస్తూనే వున్నాడు. అతని జేబులన్నీ నోట్లకట్టలతో నిండిపోతున్నాయి. జేబులో వున్న డబ్బు అయిపోయినవారు ఒకొక్కరే మెల్లగా బయటకు జారిపోతున్నారు. తెల్లవారుఝాము నాలుగుగంటలయేసరికి ఇతడొక్కడే మిగిలాడు. అతని చొక్కాజేబులూ, కోటుజేబులూ నోట్లతో నిండిపోయి వున్నాయి. చేతిలో పెద్ద దస్త్రమంత నోట్లకట్ట వున్నది.

ఆ నోట్ల కట్టవైపుచూసి, తనకు యింత శీఘ్రంగా పట్టిన యీ సిరిని గురించి ఏమనుకోవాలా అనుకుంటూ, ఒకగ్లాసు బ్రాంది తాగాడు. జూదశాల నౌకరువచ్చి "తలుపులు మూసేస్తున్నాం బాబయ్యా" అన్నాడు. అప్పుడు ఆ జమీందారు గడియారంవంక చూశాడు. నాలుగున్నర అయింది.

ఆ నౌకరుచేతిలో పదివేల రూపాయినోటు ఒకటి పెట్టాడు. "ఒక్క రూపాయుంటే యివ్వండి బాబయ్యా" అని వాడు అడిగినమాట జ్ఞాపకం వచ్చింది. తన దగ్గర ఒకరూపాయికూడా లేక పోవడమూ, జూదశాలలో నుంచి తాను వెళ్ళిపోవడమూ, దీపస్తంభందగ్గర పడుకున్న బాలిక పక్కలో నుంచి రూపాయిని తీసుకొని రావడమూ, అదంతా జ్ఞాపకం వచ్చింది. పాపం ఆ బాలిక ఏమైందో!

ఆ బాలికను తీసుకొనివెళ్ళి, పెద్ద హోటలులో, చక్కని గదిలో, మెత్తటి పరుపుమీద పడుకోబెట్టి, ఆమెనుసాకి, పెద్దదాన్నిచేసి, గొప్పవాడికిచ్చి పెళ్ళిచేసి...ఇంకా ఏమేమో ఆలోచిస్తూ అతడు ఆ బాలికపడుకునివున్న దీపస్తంభం వద్దకు గబగబ నడిచివెళ్లాడు. ఆ బాలిక అక్కడే వుంది. సంతోషంతో, అతిజాగ్రత్తగా ఆబాలికను ఎత్తుకున్నాడు. ఆబాలిక శరీరం చాలా చల్లగావుంటే మంచులో పడుకోవడంవల్ల అలా వుందనుకున్నాడు. కాని, భుజంమీద వేసుకోనేటప్పటికి ఆమె మెడ వెనక్కు తిరిగి వ్రేలాడటంతో అతనికి అనుమానం, భయమూ వేసింది. ఆ బాలిక మొహంమీద మొహం పెట్టి ఊపిరి పీలుస్తున్నదేమోనని చూశాడు.

చలికీ, మంచుకీ, రక్తం అంతా గడ్డకట్టి, శరీరమంతా కొంకరలుపోయి మరణించిన ఆ బాలిక, ఊపిరి ఎలా తీస్తుంది పాపం!

—ఒక ఫ్రెంచి కథను అనుసరించి.